

వైద్యుల కొరతతో సరోజిని కంటి దవాఖానలో క్యూలైన్‌లో నిలుచున్న రోగులు


నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, బుధవారం 31 జూలై 2024 | HYDERABAD





మలక్‌పేటలో ఓపీ కోసం క్యూలైన్‌లో రోగుల నిరీక్షణ





గాంధీలో దుస్థితి ఇది..








# సుస్తీ దవాఖాన

భర్తీ కాని ఖాళీలు.. అసోసియేట్, పీజీలతోనే సర్దుబాటు

ఐదు రోజులకు రాస్తే మూడు రోజులకే మందులు

టెక్నీషియన్స్ బదిలీలతో ఆగిన పలు రకాల వైద్యపరీక్షలు

ప్రొఫెసర్ల కొరతతో వాయిదా పడుతున్న శస్త్రచికిత్సలు

ఓపీ సేవలకు గంట నుంచి రెండు గంటల సమయం

సిటీబ్యూరో, జూలై 30(నమస్తే తెలంగాణ) /బన్సీలాల్‌పేట్/ నల్లకుంట/ సుల్తాన్‌బజార్/ నాంపల్లి/ మెహిదీపట్నం/ వనస్థలిపురం/ మల్కాజిగిరి : వైద్య, ఆరోగ్యశాఖలో ఇటీవల జరిగిన బదిలీల ప్రభావం రోగులపై కొట్టొచ్చినట్లు కనపడుతోంది. ఉస్మానియా, గాంధీ, నిలోఫర్, నల్లకుంట కోరంటి తదితర టీచింగ్ హాస్పిటల్స్‌లో బదిలీ అయిన ప్రొఫెసర్ల స్థానంలో కొత్తవారు చేరకపోవడంతో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రొఫెసర్ల కొరతతో నగరంలోని ప్రభుత్వ టీచింగ్ హాస్పిటల్స్ అన్నీ అసోసియేట్ ప్రొఫెసర్లు, పీజీ విద్యార్థులే చక్కబెడుతున్నారు. నల్లకుంట ఫీవర్ హాస్పిటల్‌కు కనీసం సూపరింటెండెంట్ కూడా లేకపోవడంతో పరిపాలన వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. ఇక ఉస్మానియా, నిలోఫర్ దవాఖానలకు సైతం పూర్తిస్థాయి సూపరింటెండెంట్ లేక పరిపాలనాపరంగా ఇబ్బందులు తప్పడం లేదు. దవాఖానల్లో మందుల కొరత వల్ల వైద్యులు 5రోజులకు మందులు రాస్తే.. అక్కడి ఫార్మసీల్లో కేవలం రెండు లేదా మూడురోజులకు మాత్రమే మందులు ఇస్తున్నారు. అంతే కాకుండా కొన్ని రకాల ఖరీదైన మందులను బయట నుంచి తెచ్చుకోవాలని సూచిస్తున్నట్లు రోగులు వాపోతున్నారు.




### గాంధీలో ఓపీకి 3నుంచి 4గంటలు..

గాంధీ దవాఖానలో ఓపీ సేవలు పొందాలంటే కనీసం 3నుంచి 4గంటల వరకు నిరీక్షించాల్సి వస్తోందని రోగులు ఆరోపిస్తున్నారు. మంగళవారం 2,234 మంది రోగులు ఓపీ సేవలు పొందారు. అయితే ఓపీ చీటీ తీసుకోవడానికే కనీసం గంటసేపు క్యూ లైన్‌లో వేచి చూడాల్సి వస్తోందని రోగులు తెలిపారు. అనంతరం వైద్యుల కన్సల్టేషన్ కోసం మరో గంట నిరీక్షణ తప్పడం లేదని, ఆ తరువాత వైద్యులు రాసిన వైద్యపరీక్షల కోసం శాంపిల్స్ ఇవ్వడానికి మరో గంట, మందుల కోసం ఫార్మసీ వద్ద అరగంట నిరీక్షణ తప్పడం లేదన్నారు. ఓపీ చీటీ తీసుకోవడం దగ్గర నుంచి మందులు తీసుకుని బయటకు వచ్చే వరకు కనీసం 3నుంచి 4గంటల సమయం పడుతుందని రోగులు వాపోతున్నారు.

### సగం మందులే..

వైద్యులు 5రోజుల కోర్సు మందులు రాస్తే ఫార్మసీ వారు కేవలం మూడు రోజులకు మాత్రమే మందులు ఇస్తున్నట్లు రోగులు తెలిపారు. ఈ విషయమై ప్రశ్నిస్తే మందులు అందరికీ సరిపోవాలి కదా? అని సమాధానం ఇస్తున్నారు. అంతేకాకుండా వైద్యులు రాసిన కొన్ని రకాల మందులు తమ వద్ద లేవని బయట తీసుకోవాలని సూచిస్తున్నారు.

### మూతపడిన రేడియాలజీ

రేడియాలజీ విభాగంలో పనిచేసే ఎనిమిది మంది టెక్నీషియన్‌లు బదిలీ కావడంతో వారి స్థానంలో కొత్త వారు చేరలేదు. దీంతో గాంధీలో రేడియాలజీ విభాగం పనిచేయడం లేదు. ఫలితంగా అక్కడ ఎక్స్-రే కోసం వస్తున్న రోగులను తరువాత రావాలని తిప్పి పంపుతున్నారు.

IVలో

### ఎక్స్-రే కోసం తిప్పుతున్నారు



నాకు నడుము నొప్పి రావడంతో గాంధీ దవాఖానకు వచ్చా. ఆర్థోపెడిక్ విభాగంలో డాక్టర్ ఎక్స్‌రే తీసుకుని రమ్మన్నారు. అక్కడకు వెళితే యంత్రం పాడైంది రేపు రమ్మని చెప్పారు. నడుము నొప్పితో బస్సులో ప్రయాణం చేసి రావడం, ఖాళీగా తిరిగి వెళ్లడం బాధగా ఉంది. పేదవాళ్లం, బయట ప్రైవేట్‌లో చూపించుకోలేము. సర్కారు దవాఖానలో జనం రద్దీ ఎక్కువగా ఉంటున్నది.

- లావణ్య, అంకిరెడ్డి పల్లె, కీసర మండలం

### అన్ని మందులు ఇవ్వలేదు



నాకు గుండె నొప్పి రావడంతో గాంధీ దవాఖానకు వచ్చాను. కార్డియాలజీ విభాగంలో డాక్టర్ పరీక్షించి, మందులను వాడమని సిఫారసు చేశారు. ఫార్మసీకి వెళ్లి లైనులో నిలబడ్డాక సగం మాత్రమే ఉన్నాయని చేతిలో పెట్టారు. మిగతా సగం కొనడానికి మా వద్ద డబ్బులు లేవు. గరీబోళ్ల కోసమే కదా ఈ దవాఖాన ఉన్నది ? మరి మందులు లేవు అంటే ఎలా ?

- హసీనా, ముషీరాబాద్

### సమస్యలు నా దృష్టికి రాలేదు



నేను వారం రోజుల క్రితమే బదిలీపై ఇక్కడకు వచ్చా. ప్రతిరోజు ఉదయం ప్రధాన భవనం, ఎమర్జెన్సీ, ఐసీయూ వార్డులు, ఓపీ, ఎంసీహెచ్ భవనాలకు వెళ్లి స్వయంగా పరిశీలిస్తున్నా. ప్రభుత్వపరంగా బదిలీల ప్రక్రియ ఇంకా కొనసాగుతున్నది. కొత్తవారు వచ్చి విధుల్లో చేరుతున్నారు. ప్రొఫెసర్ల బదిలీ కారణంగా శస్త్ర చికిత్సలపై ప్రభావం లేకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకున్నాం. ఓపీలో మందుల కొరత లేదు. అలాంటిది నా దృష్టికి రాలేదు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి కృషి చేస్తున్నాం.

- డాక్టర్ సీహెచ్.ఎన్.రాజకుమారి, సూపరింటెండెంట్, గాంధీ దవాఖాన



ఉస్మానియాలో..



ఉస్మానియాలో..






గాంధీ దవాఖానలో..



వనస్థలిపురం ఏరియా దవాఖానలో..

# 6 గంటలు అస్తవ్యస్తం

• ఆశా వర్కర్ల ధర్నాతో ఎక్కడికక్కడ స్తంభించిన ట్రాఫిక్



**గంట కాదు.. రెండు గంటలు కాదు..** మంగళవారం ఏకంగా ఆరు గంటల పాటు నగర ప్రజలు ట్రాఫిక్‌లో చిక్కుకొని విలవిలలాడారు. కోఠిలో ఆశ వర్కర్లు ధర్నాకు దిగడంతో ఆ ప్రభావం సగం నగరం పై పడింది. దీంతో ట్రాఫిక్ ఎక్కడికక్కడే స్తంభించింది. వాహనదారులు ట్రాఫిక్‌లో చిక్కుకొని బిక్కు బిక్కుమంటూ ఆగిపోయారు. ఆశ వర్కర్లు ధర్నా చేయడానికి వస్తున్నారనే విషయం తెలిసినా లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీసులు ఏ మాత్రం ముందస్తు చర్యలు తీసుకోకపోవడంతోనే వాహనదారులు సమస్యలు ఎదుర్కోవాల్సి వచ్చింది. నగరంలో శాంతి భద్రతలు, ట్రాఫిక్ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందంటూ బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు అసెంబ్లీలో ఆందోళన వ్యక్తం చేస్తున్న క్రమంలోనే ఈ ఘటన చోటు చేసుకోవడం గమనార్హం. ట్రాఫిక్ నిద్రావస్థలో ఉందని చెప్పడానికి ఈ ఘటన ప్రత్యక్ష నిదర్శనమని నగర వాసులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా రూట్లలో అలర్ట్ చేసి ప్రత్యామ్నాయ మార్గాల్లో వాహనదారులు వెళ్లాలంటూ సూచనలు ఇవ్వాల్సిన ట్రాఫిక్ పోలీసులే ఆ విషయాన్నే విస్మరించారు. దీంతో మంగళవారం ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కోఠి చుట్టు పక్కల ప్రాంతాల్లో ట్రాఫిక్ స్తంభించింది.

- సిటీబ్యూరో, జూలై 30 (నమస్తే తెలంగాణ)




# మీరేం చెప్పొద్దు.. నాకంతా తెలుసు!

**శిశువుకు అత్యవసర చికిత్స ఉందని చెప్పినా వినిపించుకోని సెక్యూరిటీ గార్డు**

శిశువుతో పాటు తండ్రిని అత్యవసర వార్డులోకి వెళ్లకుండా అడ్డుకున్న వైనం

రెండు గంటల తర్వాత లోపలికి అనుమతి

అప్పటికే జరిగిపోయిన నష్టం.. అపస్మారక స్థితిలోకి వెళ్లిన శిశువు

డాక్టర్లు పరిశీలించి చనిపోయిందని నిర్ధారణ

పేట్లబుర్జ్ ప్రసూతి దవాఖానలో ఘటన

చార్మినార్, జూలై 30 : ''నువ్వెంత.. నాకేం చెప్పొద్దు.. నేనేం చేయాలో నాకు తెలుసు. ఎవరిని ఎప్పుడు డాక్టర్ దగ్గరకు పంపాలో నాకు తెలియదా? ఇక్కడ నుంచి జరిగి అటు పక్కకు నిలబడు. నీ నంబర్ వచ్చిన తర్వాత పిలుస్తా. నాకే ఎదురు చెబితే పేషంట్‌కు ట్రీట్‌మెంట్ మరోలా ఉంటుందంటూ చిందులేసింది. తీరా 2 గంటల తర్వాత లోపలికి పంపించింది. తీరా డాక్టర్ వద్దకు వెళ్తే.. ఏంటయ్యా ఇంత లేటు.. కాస్త ముందుగా తీసుకొస్తే పిల్లోడు బతికేవాడు కదా? పై పెచ్చు బిడ్డపై ఎందుకింత నిర్లక్ష్యమా'' అన్న మాటలతో బాధితుల బాధ వర్ణనాతీతం. రాష్ట్రంలోనే పేరున్న పేట్లబుర్జ్ ప్రసూతి దవాఖానలో జరిగిన ఈ దారుణ ఘటనలో ఓ ఉద్యోగి నిర్లక్ష్యంతో శిశువు నిండు ప్రాణాలు కోల్పోయింది. బాధితుల కథనం ప్రకారం.. షాబాద్ పెద్దవేడు గ్రామానికి చెందిన మాణిక్యరెడ్డి తన భార్యను ప్రసూతి కోసం ఈ నెల 28న పేట్లబుర్జ్‌లో చేర్పించాడు. అదే రోజు సిజేరియన్ ద్వారా చిన్నారికి వైద్యులు ప్రాణం పోశారు. సంవత్సరాల తరువాత పుట్టిన బిడ్డ కావడంతో కుటుంబ సభ్యులు మురిసిపోయారు. ఈ క్రమంలో చిన్నారికి బ్రీతింగ్ సమస్య రావడంతో.. అత్యవసర చికిత్స అందించే వార్డుకు తరలించాలని వైద్యులు సూచించారు. మాణిక్యరెడ్డి చిన్నారిని తీసుకుని అత్యవసర చికిత్స అందించే వార్డుకు తీసుకెళ్లారు. అక్కడి సెక్యూరిటీ గార్డు భాగ్యలక్ష్మి మాణిక్య రెడ్డిని అడ్డుకుని ''వార్డులో చాలామంది పేషంట్లు ఉన్నారు. మీ నంబర్ వచ్చిన తరువాత నేను పిలుస్తాను. అప్పటి వరకు అక్కడే వేచి ఉండాలని'' హెచ్చరించింది. డాక్టర్ చెబితేనే తీసుకొచ్చానని చిన్నారి తల్లిదండ్రులు ఎంత చెప్పినా వినిపించుకోకుండా రెండు గంటల పాటు అక్కడే నిలబెట్టింది. తరువాత వార్డులోకి వెళ్లడానికి అనుమతి ఇవ్వడంతో వైద్యుల వద్దకు బాధితులు పరుగులు పెట్టారు. అప్పటికే శిశువు అపస్మారక స్థితిలోకి వెళ్లింది. పరీక్షించిన వైద్యులు ఏంటయ్యా చిన్నారులంటే ఇంత అలుసా? చివరి నిమిషంలో తీసుకువచ్చావు. ఇంకొంచెం ముందు గా వస్తే పసివాడిని బతికించే వాళ్లం కదా? అనడంతో మాణిక్యరెడ్డి ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. జరిగిన విషయాన్ని వైద్యులకు తెలియజేయడంతో పాటు సెక్యూరిటీ గార్డు భాగ్యలక్ష్మి చేసిన నిర్వాకాన్ని మంగళవారం చిన్నారి తల్లిదండ్రులు దవాఖాన సూపరింటెండెంట్ పి.రజినీ రెడ్డికి బాధితులు ఫిర్యాదు చేశారు.